సాక్షి
కర్నూలు
గురువారం । 23 । మార్చి । 2023



అన్న ప్రసాద పథకానికి విరాళం
శ్రీశైలంటెంపుల్: శ్రీశైలదేవస్థానం నిత్యాన్న దాన పథకానికి బుధవారం కర్ణాటకకు చెందిన భక్తులు మహాదేవి రూ.1,00,001, సంతోష్ రూ.1,00,001 విరాళంగా అందజేశారు.



నిమ్మ ధర నిగనిగ!
నిమ్మ రైతుకు ఈ ఏడాది కలిసొచ్చింది. రెండు నెలల నుంచి ధరలు క్రమంగా పెరుగుతున్నాయి. ఒక దశలో బస్తా రూ.8 వేలు వరకుపలికింది.
8లో



ఆంత్రాక్స్ ప్రమాదం
కోవెలకుంట్ల ప్రాంతంతో ఆంత్రాక్స్ వ్యాధి బారిన పడి ఇటీవల మూడు గొర్రెలు మృత్యువాత పడ్డాయి. పెంపకందారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది.
8లో



హదీస్ వెలుగు:
"ఆకలి దప్పికలు తెలిస్తేనే పేదల కష్టాలు తెలుస్తాయి. రోజాలు పాటించి ఉపవాసాలు ఉంటేనే మనిషి అహం తగ్గి ఆధ్యాత్మికం వైపు నడుస్తారు.' – పవిత్ర ఖురాన్

న్యూస్‌రీల్

వైఎస్సార్ జగనన్న కాలనీలకు ముఖ ద్వారాలు

- రూ.1.66 కోట్లతో 40 కాలనీల్లో నిర్మాణం



ముఖ ద్వారం నమూనా

కర్నూలు(అర్బన్): జిల్లాలోని 40 వైఎస్సార్ జగనన్న కాలనీలకు రూ.1.66 కోట్ల వ్యయంతో ముఖ ద్వారాలను నిర్మించనున్నట్లు పీఆర్ పర్యవేక్షక ఇంజనీరు కె.సుబ్రమణ్యం తెలిపారు. బుధవారం ఆయన 'సాక్షి' తో మాట్లాడుతు నిర్మాణాలకు సంబంధించి ప్రభుత్వం ఈ ఏడాది జనవరి నెలలో పాలనా అనుమతులను మంజూరు చేసిందన్నారు. జిల్లాలోని ఆదోని, ఆలూరు, మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు, పత్తికొండ, పాణ్యం సబ్ డివిజన్లలో వీటిని నిర్మిస్తామన్నారు. ఒక్కో ముఖ ద్వారానికి రూ.4.15 లక్షల చొప్పున నిధులను వ్యయం చేస్తామన్నారు. ఒక్కో ముఖ ద్వారం 16 అడుగుల ఎత్తు, 20 అడుగుల వెడల్పు ఉంటుందన్నారు. ఏప్రిల్ నెల రెండో వారం నాటికి ఈ పనుల పూర్తికి జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు ఆదేశాలు జారీ చేశారన్నారు.

ఉగాది పురస్కారాల ప్రదానం

- ముగ్గురు అర్చకులను సన్మానించిన జిల్లా కలెక్టర్



పురస్కార గ్రహీతలతో కలెక్టర్ కోటేశ్వరరావు

కర్నూలు కల్చరల్: దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఉత్తమ సేవలు అందిస్తున్న అర్చకులకు ఉగాది పురస్కారాలను ప్రదానం చేశారు. బుధవారం కలెక్టర్ పి.కోటేశ్వరరావు తన చాంబర్‌లో కర్నూలు పేట ఆంజనేయ స్వామి ఆలయం అర్చకులు జంగం శివలింగయ్య, గోనెగండ్ల మండలం వెంగోడు చెన్నకేశవ స్వామి ఆలయం అర్చకులు పూజారి సత్యనారాయణ స్వామి, పెద్ద కడుబూరు మండలం తారాపురం గ్రామం గిడ్డాంజనేయ స్వామి ఆలయం అర్చకులు టి.నాగరాజులకు ఉగాది పురస్కారాలను ప్రదానం చేసి ఘనంగా సన్మానించారు. గౌరవ సూచకంగా రూ.10, 016 నగదును అందజేశారు. దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఆదిశేషు నాయుడు, ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రాధాన్యత భవన నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి



కే సుబ్రమణ్యం, పీఆర్ ఎస్ఈ

కర్నూలు(అర్బన్): ప్రభుత్వ ప్రాధాన్యత భవన (ఆర్‌బీకే, గ్రామ సచివాలయం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్స్) నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు పీఆర్ ఎస్ఈ కే సుబ్రమణ్యం తెలిపారు. ఈ మేరకు ఇంజనీర్లకు సూచనలు జారీ చేసినట్లు చెప్పారు. బుధవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ.. జిల్లాలో గ్రామ సచివాలయ భవన నిర్మాణాలు 456 ప్రారంభం కాగా ఇప్పటి వరకు 136 పూర్తయ్యాయని, 305 భవన నిర్మాణాల పనులు వేర్వేరు దశల్లో ఉన్నాయన్నారు. మిగిలిన 15 భవన నిర్మాణ పనులను త్వరితగతిన ప్రారంభించాలన్నారు. అలాగే 446 ఆర్‌బీకేలకు గాను ఇప్పటి వరకు 80 పూర్తి కాగా, 330 వేర్వేరు దశల్లో ఉన్నాయని, మిగిలిన 36 భవన నిర్మాణ పనులను చేపట్టాల్సి ఉందన్నారు. 352 వైఎస్సార్ హెల్త్ క్లినిక్స్ భవనాల్లో 28 మాత్రమే పూర్తి అయ్యాయని, 291 వివిధ దశల్లో ఉండగా, 33 భవన నిర్మాణాల పనులను వెంటనే చేపట్టాలని ఆదేశించినట్లు చెప్పారు. చేసిన పనులకు సంబంధించి ఇప్పటి వరకు రూ.40 కోట్ల వరకు బిల్లులను అప్‌లోడ్ చేశామని, నెలఖారు నాటికి విడుదలయ్యే అవకాశాలు ఉన్నాయని ఎస్ఈ వివరించారు.



రమావాణీసేవిత రాజరాజేశ్వరి అలంకారంలో ఉన్న అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకులు



అశేష భక్తజనం మధ్య శ్రీశైల పురవీధుల్లో సాగుతున్న మల్లన్న రథోత్సవం

ఇల కైలాసం.. ఉగాది వైభోగం

- కనుల పండువగా స్వామి అమ్మవార్ల రథోత్సవం
- పోటెత్తిన కన్నడిగులు.. మార్మోగిన ఓంకార నాదం
- రమావాణీ సేవిత రాజరాజేశ్వరిగా అమ్మవారు దర్శనం
- నేటి పూర్ణాహుతితో ముగియనున్న ఉగాది ఉత్సవాలు

శ్రీశైలం టెంపుల్: ఇల కైలాసం శ్రీగిరిలో ఓంకార నాదం మార్మోగింది. మల్లన్న వైభవాన్ని చూసి భక్తులు పరవశించిపోగా శ్రీభ్రమరాంబాదేవి రమావాణి సేవిత రాజరాజేశ్వరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉగాది ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు బుధవారం స్వామి, అమ్మవార్ల రథోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. ముందుగా ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామి అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తులను పల్లకీలో ఆశీనులు చేసి ఊరేగింపుగా రథశాల వద్దకు తీసుకెళ్లి రథంపై అధిష్ఠింపజేశారు. అనంతరం స్థానాచార్యులు రథాంగపూజ, రథాంగహోమం, రథాంగబలి నిర్వహించారు. అర్చకులు ఉత్సవ మూర్తులకు ప్రత్యేక హారతులిచ్చారు. దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎస్.లవన్న, అధికారులు రథానికి కూష్మాండబలి సమర్పించారు. అనంతరం రథానికి ప్రత్యేక హారతి ఇచ్చి రథోత్సవాన్ని ప్రారంభించారు. ఈ వేడుకలో లక్షలాది మంది కన్నడ భక్తులు పాల్గొని సిరిగిరి మల్లయ్య.. మహాత్మ మల్లయ్య..అని కొనియాడుతూ ఓంకారనాద ధ్వనుల మధ్య రథంపైకి అరటి పండ్లు, ఖర్జూరాలు, కలకండ విసిరి భక్తి చాటుకున్నారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకుని పరవశించిపోయారు. గంగాధర మండపం నుంచి నంది మండపం వరకు సాగిన ఈ రథోత్సవంలో కర్ణాటక జాంజ్, వీరగాసీ, కన్నడ జానపదడోలు, కోలాటం, చెక్కభజన, పగటి వేషాల ప్రదర్శన, బుట్టబొమ్మలు, గొరవయ్యల నృత్యం, తప్పెట్లు, కొమ్ము వాయిద్యాలు, నందికోలు నృత్యాలు అలరించాయి. కాగా రథోత్సవ దర్శనం ద్వారా సర్వపాపాలు తొలగిపోతాయని, కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం.

నేడు ఉగాది ఉత్సవాలకు పూర్ణాహుతి

మార్చి 19వ తేదీ నుంచి ప్రారంభమైన ఉగాది మహోత్సవాలకు గురువారం పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించనున్నారు. అమ్మవారికి భ్రమరాంబాదేవి నిజాలంకరణ, స్వామిఅమ్మవార్లకు అశ్వవాహనసేవ, ఆలయ ఉత్సవం నిర్వహిస్తారు. దీంతో ఉగాది మహోత్సవాలు ముగుస్తాయి.

కోర్కెలు తీర్చే రమావాణీసేవిత రాజరాజేశ్వరి

ఉగాది మహోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు శ్రీభ్రమరాంబాదేవి రమావాణిసేవిత రాజరాజేశ్వరి అలంకారంలో భక్తులకు కటాక్షించింది. చతుర్భుజాలు కలిగిన ఈ దేవి పాశం, అంకుశం, పద్మం, చెరకుగడను ధరించి దర్శనం ఇచ్చారు. ఈ దేవిని దర్శించడం వలన కోరిన కొర్కెలు నెరవేరుతాయని, సమస్యలన్నీ తొలగిపోతాయని భక్తుల నమ్మకం.



రథంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులు



స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో తీసుకెళ్తున్న ఈఓ, జగద్గురుపీఠాధిపతి, అర్చకులు

తక్కువ పెట్టుబడి.. ఎక్కువ రాబడి

- అంజూర సాగు లాభదాయం
- ఎకరాకు 5 టన్నులకుపైగా దిగుబడి
- పొలం దగ్గరే టన్ను రూ.80 వేల ప్రకారం అమ్మకం



అంజూర తోట

కర్నూలు(అగ్రికల్చర్): అంజూర సాగు రైతులకు లాభాల పంట పండిస్తోంది. పెట్టుబడులు పోను ఎకరాకు రూ.5 లక్షల ఆదాయం లభిస్తోంది. జిల్లాలో దాదాపు 30 ఎకరాల్లో ఈ పంటను సాగు చేస్తున్నారు. కొంచెం వగరు, కొంచెం తీపి, కాస్త పులుపుతో ఉంటే ఈ పండు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తోంది. అనేక శారీరక సమస్యలను దూరం చేసే పోషకాలను అందిస్తోంది. పచ్చివి, ఎండువి శరీరానికి చలువ చేస్తాయి. సీమ మేడి పండుగా వ్యవహరించే దీనిలో కొవ్వు, పిండిపదార్థాలు, సోడియం వంటి లవణాలు తక్కువగా ఉంటాయి.

బ్రౌన్ టర్కీ రకం మేలైనది

అంజూరలో బ్రౌన్ టర్కీ రకం మేలైనది. ఈ రకాన్ని టర్కీ నుంచి తెప్పించి అనంతపురంలోని ల్యాబ్‌లో టిష్యూకల్చర్ విధానంలో అంటుగట్టి అభివృద్ధి చేస్తారు. ఒక్కో మొక్క పొలం చేరే సరికి రూ.120 ఖర్చు వస్తుంది. అధిక సాంద్ర పద్ధతిలో ఎకరాకు 650 నుంచి 700 మొక్కలు నాటవచ్చు. మొదటి ఏడాది ఎకరాకు రూ.20 వేల ప్రకారం ఖర్చు వస్తుంది. మరుసటి ఏడాది నుంచి ఎకరాకు కేవలం రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు పెట్టుబడి పెట్టాల్సి ఉంది.

'ప్రకృతి' పద్ధతుల్లో సాగు ఉత్తమం

ఎటువంటి రసాయనాలు వాడకుండా ప్రకృతి వ్యవసాయ విధానంతో అంజూరు సాగు చేస్తే నాణ్యమైన దిగుబడులు వస్తాయి. మార్కెట్‌లో మంచి ధర లభిస్తుంది. పంటకు సమయానుకూలంగా ద్రవ, ఘన జీవామృతం, నీటి తడులు ఇవ్వాలి. ఒక్కసారి అంట్లు తెచ్చుకొని నాటుకుంటే 30 ఏళ్లకు పైగా పంట వస్తుంది. జూన్‌లో మొదలై వంబరు, డిసెంబరు వరకు ఎకరాకు 5 టన్నులకుపైగా దిగుబడి సాధించవచ్చు. అంజూరలో పోషక విలువలు అపారంగా ఉండటంతో మార్కెట్‌లో వీటికి డిమాండ్ ఎక్కువగా ఉంటోంది.

రూ.5 లక్షల ఆదాయం వచ్చింది



నేను 2016లో మూడు ఎకరాల్లో అంజూరు సాగు చేశాను. నాలుగేళ్ల నుంచి దిగుబడి వస్తోంది. బ్రౌన్ టర్కీ రకం అంజూరలో నాణ్యత, రుచి ఎక్కువగా ఉంటోంది. ప్రస్తుతం రోజుకు 1,500 కిలోల దిగుబడి వస్తోంది. పొలం దగ్గర కిలో రూ.80 ప్రకారం వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. పెట్టుబడులు పోను ఎకరాకు రూ.5 లక్షల ఆదాయం వస్తోంది. – గొల్ల శ్రీరాములు, గూడూరు

నో సెల్‌ఫోన్ జోన్లుగా 'పది' పరీక్ష కేంద్రాలు

- ప్రశ్నపత్రాలపై ఏడు అంకెల కోడ్
- ఈ కోడ్‌తో పేపర్ లీకేజీ తెలుసుకోవచ్చు
- జిల్లాలో 149 పరీక్ష కేంద్రాల ఎంపిక
- పరీక్షలకు హాజరుకానున్న 32,780 మంది విద్యార్థులు
- నేడు, రేపు జిల్లాకు టెన్త్ ప్రశ్నపత్రాలు
- ఆ వెంటనే 38 స్టోరేజీ కేంద్రాలకు తరలింపు



కర్నూలు సిటీ: పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు విద్యాశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. గతేడాది నందికొట్కూరు, కొలిమిగుండ్ల మండలం అంకిరెడ్డిపల్లె హైస్కూళ్లలో జరిగిన ఘటనల దృష్ట్యా ఈ ఏడాది ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాలను నో సెల్‌ఫోన్ జోన్లుగా ప్రకటించారు. కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లను నిషేధించారు. అదే విధంగా ప్రశ్నపత్రంలో ఏడు అంకెల ప్రత్యేక కోడ్‌ను ముద్రించారు. ఎక్కడైన ప్రశ్నపత్రం లీకేజీ అయినా.. ఆ పేపర్‌పై ఉన్న ఏడు అంకెల కోడ్‌ను బట్టి సులువుగా ఏ సెంటర్ నుంచి ప్రశ్నపత్రం బయటకు వచ్చిందో స్పష్టంగా తెలుసుకునేందుకు అవకాశం ఉంటుంది. పరీక్ష కేంద్రాలను ఇప్పటికే విద్యాశాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. గదుల్లో లైటింగ్ ఉండేలా, ఫ్యాన్లు తిరిగేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. మన బడి నాడు-నేడు కింద రెండో విడతలో చేపట్టిన పనులు పూర్తి చేసేలా సమగ్ర శిక్ష విభాగం, విద్యాశాఖ అధికారులు సమన్వయంతో పని చేస్తున్నారు. సమస్యాత్మక పరీక్ష కేంద్రాల దగ్గర అదనపు పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేయనున్నారు.

149 కేంద్రాల్లో పరీక్షలు

వచ్చే నెల 3వ తేదీ నుంచి మొదలు కానున్న పదో తరగతి పరీక్షలకు జిల్లాలో 149 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో ఏ సెంటర్లు (పోలీసు స్టేషన్లకు దగ్గర ఉండేవి) 79, బీ సెంటర్లు(పోలీసు స్టేషన్లకు 8 కి.మీ. లోపు ఉండేవి)56, సీ సెంటర్లు (పోలీసు స్టేషన్లకు 8 కి.మీ.కు పైగా ఉన్నవి)14 ఉన్నాయి. ఈ కేంద్రాలలో 490 ఉన్నత పాఠశాలలకు చెందిన 32,780 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్షల విధులు నిర్వహించేందుకు 149 మంది ముఖ్య పర్యవేక్షకులను, 149 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లను, 1,664 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. 11 సమస్యాత్మమైక, 9 అత్యంత సమస్యాత్మకమైన పరీక్ష కేంద్రాల్లో సిట్టింగ్ స్క్వాడ్ ఉండనున్నారు. అలాగే 7 ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్‌లు పనిచేయనున్నాయి.

నేడు, రేపు జిల్లాకు ప్రశ్నపత్రాలు

పదో తరగతి ప్రశ్నపత్రాలు నేడు, రేపు జిల్లాకు రానున్నాయి. నేడు(గురువారం) మొదటగా సెట్-1, రేపు(శుక్రవారం)రెండో సెట్ ప్రశ్నపత్రాలు రానున్నాయి. వీటిని జిల్లాలో ఎంపిక చేసిన 38 స్టోరేజీ పాయింట్లకు చేర్చి అక్కడ భద్రపరచనున్నారు. ఇందుకు ఇప్పటికే 11 రూట్లకు ఆఫీసర్లను సైతం ఎంపిక చేశారు.

జాగ్రత్తగా విధులు నిర్వర్తించాలి



పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాలోని 149 పరీక్ష కేంద్రాలను నో సెల్‌ఫోన్ జోన్లుగా ప్రకటించాం. నాతో సహా ఏ స్థాయి అధికారి అయినా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు తీసుకపోకూడదు. కేంద్రాలుగా ఏర్పాటు చేసిన ప్రాంతాలను హై సెక్యూరిటీ జోన్లుగా ప్రకటించారు. ఏ చిన్న తప్పు జరిగినా సంబంధిత కేంద్రాల్లో విధులు నిర్వహించే వారే బాధ్యులు అవుతారు. జాగ్రత్తగా విధులు నిర్వహించాల్సి ఉంటుంది. – డాక్టర్ వెంకట రంగారెడ్డి, డీఈఓ

చౌడమ్మా.. దీవించమ్మా!



కల్లూరులో వెలసిన చౌడేశ్వరీ అమ్మవారు భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్నారు. తమ కోరికలు నెరవేరితే ఎద్దులతో, గార్దబా(గాడిద)లతో అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తామని ప్రజలు మొక్కుకుంటారు. ఉగాది పర్వదినం సందర్భంగా బుధవారం ఎద్దులతో ఆలయం చుట్టూ బురదలో ప్రదక్షిణ చేశారు. ఈ విధంగా చేస్తే అమ్మవారి కృప తమపై ఉంటుందని, పశువులకు మంచి ఆరోగ్యం సిద్ధిస్తుందని వారి నమ్మకం. – సాక్షిఫొటోగ్రాఫర్, కర్నూలు

తర్తూరు బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



అలంకరణలో రంగనాథ స్వామి మూలవిరాట్

జూపాడుబంగ్లా: తర్తూరు శ్రీలక్ష్మీరంగనాథస్వామి బ్రహ్మోత్సవాలకు బుధవారం అంకురార్పణ చేశారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఉల్వావంశానికి చెందిన ఆలయ అర్చకుడు వినాయకుడికి ప్రథమ పూజ చేసి ప్రారంభించారు. తర్వాత శేషవాహనంపై నిద్రిస్తున్న శ్రీలక్ష్మీరంగనాథుని మూల విగ్రహంతో పాటు చెక్కబొమ్మ రూపంలో ఉన్న స్వామివారి నిజరూపాన్ని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. గ్రామస్తులు ప్రభోత్సవ వాహనాన్ని వెలికితీసి బ్రహ్మోత్సవాల నిర్వహణకు సిద్ధం చేశారు. ఈనెల 29 నుంచి పది రోజుల పాటు స్వామి స్వామి బ్రహ్మోత్సవాలు జరుగుతాయని ఆలయ అర్చకులు తెలిపారు.

ప్రారంభమైన శ్రీరామనవమి వేడుకలు



స్వామి వారికి పూజలు చేస్తున్న పీఠాధిపతి

ఆదోని అర్బన్: మండలంలోని పెద్దతుంబళం గ్రామంలో బుధవారం శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు ధ్వజారోహణంతో వేడుకలకు అంకురార్పణ పలికారు. ఉత్సవ నిర్వాహకులు రామాంజనేయులు ఆధ్వర్యంలో జానకీసమేత రామలక్ష్మణ స్వామివార్లకు ఫల పంచామృతాభిషేకం చేశారు. గోపూజ, గణపతిహోమం, విష్ణుసహస్రనామ పారాయణం జరిపారు. ఈ పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు మాట్లాడుతూ.. భారతదేశం సనాతన ధర్మంతో కూడినదని, ప్రతి ఒక్కరూ ధర్మాన్ని పాటించాలని సూచించారు. ఆలయాభివృద్ధికి మఠం ద్వారా తనవంతు సహాయ సహకారాలు అందజేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు నర్సిరెడ్డి, బసవరాజ్, వీరేష్, పరమేష్, గరుడాద్రి దత్తాత్రేయ శర్మ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుర్తుతెలియని వ్యక్తి మృతి


మృతిచెందిన గుర్తు తెలియని వ్యక్తి

కర్నూలు: పెద్దాసుపత్రిలో చికిత్సపొందుతూ కోలుకోలేక గుర్తు తెలియని వ్యక్తి బుధవారం మృతిచెందాడు. నాల్గవ పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కర్నూలు నగరంలోని సంతోష్‌నగర్ బ్రిడ్జి వద్ద సుమారు 55 సంవత్సరాల వయస్సు ఉన్న వ్యక్తి అపస్మారక స్థితిలో ఉండగా స్థానికులు కనుగొని సమాచారమివ్వగా 108 అంబులెన్స్‌లో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందడంతో నాల్గో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసినవారు 94412 90736కు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు.

కోసిగిలో చోరీ


బీరువా తలుపులు తెరిచిన దృశ్యం

కోసిగి: మండల కేంద్రమైన కోసిగిలో చోరీ జరిగింది. విద్యుత్ శాఖలో లైన్‌మ్యాన్‌గా పనిచేస్తున్న మాల నరసింహులు మంగళవారం కౌతాళం మండలం రౌడూరు గ్రామంలో వెలసిన జెట్టప్ప తాత మఠానికి దర్శనార్థం కుటుంబ సమేతంగా ఇంటికి తాళం వేసి వెళ్లారు. బుధవారం ఉదయం ఇంటి పక్కన వారు కుళాయి నీళ్ల పడుతుండగా తాళం పగిలి కింద పడి ఉండడం గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వెంటనే గ్రామానికి చేరుకుని పరిశీలించగా బీరువా తలుపులు పగిలి వస్తువులు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. మంగళవారం రాత్రి దొంగతనం జరిగినట్లు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. రూ.1.50 లక్షల నగదు, 6.50 తులాల బంగారు నగలు అపహరించి వెళ్లినట్లు బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాజారెడ్డి తెలిపారు. కర్నూలు నుంచి క్లూయిస్ టీమ్ తెప్పించి వేలిముద్రలు సేకరించారు. దొంగలను పట్టుకుని బాధితులకు న్యాయం చేస్తామని ఎస్‌ఐ తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నరహరి

బొమ్మలసత్రం: నంద్యాల మండల పరిధిలోని మునగాల గ్రామంలో బుధవారం ఓ యువకుడు ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. స్థానికుల సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన మల్లెపోగుల నరహరి ఆటో నడుపుతూ జీవనం సాగించేవాడు. పండగ సందర్భంగా ఊరి మహిళలు స్థానిక సుంకులాపరమేశ్వరి ఆలయానికి బోనాలతో బయలుదేరారు. అనుమతి లేకుండా వారిని దగ్గరి నుంచి నరహరి తన సెల్‌ఫోన్‌లో చిత్రీకరిస్తుండగా గ్రామస్తులు గమనించి దేహశుద్ధి చేశారు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన నరహరి పురుగల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.


అహోబిలంలో స్వామి వారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు


నందవరం మండలం జొహరాపురంలో బోనాలతో వెళ్తున్న భక్తులు


గూడూరు మండలం పెంచికలపాడులో చెన్నకేశవస్వామి కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు


కౌతాళంలోని ఖాదర్‌లింగ స్వామి దర్గాలో నూతన పంచాంగ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న హిందువులు, ముస్లింలు

ఊరూరా ఉగాది 'శోభ'

శోభకృత్ నామ నూతన తెలుగు సంవత్సరానికి ఆహ్వానం పలుకుతూ జిల్లాలో బుధవారం ఉగాది వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. గ్రామ దేవతలైన సుంకులమ్మ, రేణుకా ఎల్లమ్మ, సవారమ్మ, మారెమ్మలకు చీరెలు, సారెలు, నైవేద్యాలు సమర్పించారు. రైతులు ఎద్దులను ప్రత్యేకంగా అలంకరించి గ్రామాల్లో ఊరేగిస్తూ ఆలయాలను సందర్శించారు.వేద పండితులు, పురోహితులు పంచాంగ పఠనం చేశారు. ఆలయాల్లో ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక కార్యక్రమాలు, కవి సమ్మేళనాలు, సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

– సాక్షినెట్‌వర్క్


మిడుతూరులో సుంకులమ్మకు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం


కోడుమూరులో జనవాహిని మధ్య సాగుతున్న వల్లెలాంబదేవి రథోత్సవం


పాములపాడులో నాభిశిల వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్న ప్రజలు


నంద్యాల సంజీవనగర్ రామాలయంలో ప్రత్యేక అలంకరణలో సీతారామ లక్ష్మణులు


ఉయ్యాలవాడ మండలం అల్లూరు నుంచి తేరుబండిని తీసుకువస్తున్న గ్రామస్తులు


కృష్ణగిరి మండలం ఆలంకొండలో ఎద్దుల బండిలో పారువేటకు వెళ్తున్న దృశ్యం


ఉగాది ఉత్సవాల్లో భాగంగా పొట్టేళ్ల పోటీ


రుద్రవరం మండలం ముత్తలూరులో రథాన్ని లాగుతున్న పొట్టేళ్లు


దేవనకొండ మండలం పి. కోటకొండ గ్రామంలో పంచాంగ పఠనం


నంద్యాల పట్టణంలో రంగులు చల్లుకుంటున్న మహిళలు


తుగ్గలి మండలం కడమకుంట్ల గ్రామంలో కబడ్డీ ఆట పోటీలను ప్రారంభిస్తున్న పత్తికొండ ఎమ్మెల్యే శ్రీదేవి

రైతు మద్దయ్యకు ఉగాది పురస్కారం


ఉగాది పురస్కారాన్ని అందుకుంటున్న దిబ్బమడుగు మద్దయ్య

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయంలో విశేషమైన ప్రతిభ కనబరిచిన అతి సాధారణ రైతు దిబ్బమడుగు మద్దయ్య బుధవారం ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వైస్ చాన్స్‌లర్ విష్ణువర్ధన్‌రెడ్డి, పలువురు ప్రముఖుల చేతుల మీదుగా ఉగాది పురస్కారాన్ని అందుకున్నారు. రాష్ట్రం మొత్తం మీద ఆరుగురు రైతులకు ఉగాది పురస్కారాలు లభించాయి. వీరిలో ఓర్వకల్లు మండలం చెన్నంచెట్టిపల్లి గ్రామానికి చెందిన మద్దయ్య ఒకరు. నూనె గింజలకు చెందిన ఆముదం సాగులో నూతన వంగడాల వినియోగం, వినూత్న పద్ధతులు పాటించి తక్కువ ఖర్చుతో గణనీయమైన దిగుబడులు సాధించారు. ఉగాది పురస్కారాన్ని అందుకున్న మద్దయ్యను ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ రామారావు, విస్తరణ సంచాలకులు విజయాభినందన, పరిశోధన సంచాలకులు ప్రశాంతి అభినందించారు. గుంటూరులో జరిగిన ఈ కార్యక్రమంలో కర్నూలు ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త ప్రసాద్‌బాబు కూడా పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి..


గాయపడిన సుబ్బారెడ్డి

డోన్ రూరల్ : ప్రమాదవశాత్తూ రైలులో నుంచి ఓ వ్యక్తి జారి కింద పడి గాయాల పాలయ్యాడు. మండల పరిధిలోని దొరపల్లి బ్రిడ్జి వద్ద బుధవారం ఈ సంఘటన జరిగింది. స్థానికుల సమాచారం మేరకు రైల్వే పోలీసులు అక్కడికి చేరుకుని కింద పడిన వ్యక్తిని వెంటనే డోన్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాలికి బలమైన గాయం కావడంతో మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు రెఫర్ చేశారు. కాగా క్షతగాత్రుడిది వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు మండలం మార్లగుడి గ్రామానికి చెందిన సుబ్బారెడ్డిగా పోలీసులు తెలిపారు. గాయపడిన వ్యక్తి ఏ ట్రైన్‌లో ఎక్కాడు..ఎక్కడికి వెళ్తున్నాడు తదితర వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

నిమ్మ ధర నిగనిగ!



- రోజురోజుకు పెరిగిపోతున్న నిమ్మ ధరలు
- మార్కెట్లో బస్తా(ఏ 1 రకం) ధర రూ.4,000 నుంచి రూ.4,500
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు


యాదవాడలో పొలం దగ్గర నిమ్మకాయలను గ్రేడింగ్ చేస్తున్న దృశ్యం,(ఇన్‌సెట్) నిమ్మ తోట

ఆళ్లగడ్డ: రోజు రోజుకు నిమ్మ ధరలు పెరిగిపోతున్నాయి. గత కొన్ని సంవత్సరాలుగా ధరల్లేక.. ధర ఉన్నా ఆశించిన మేర దిగుబడి రాక నష్టాలు చవి చూసిన రైతులకు ఈ ఏడాది కలిసొచ్చింది. ప్రకృతి అనుకూలించడంతో ఏడాది పొడవునా మంచి కాపు కాస్తున్నాయి. డిసెంబర్ నుంచి ఫిబ్రవరి వరకు కాయ నాణ్యతను బట్టి బస్తా రూ.2000 నుంచి రూ.2200 వరకు ధర పలికింది. ప్రస్తుతం శుభకార్యాలు, పెళ్లిళ్లు, పండుగలు, జాతరలతో పాటు వేసవి గిరాకీ కూడా తోడు కావడంతో నిమ్మ ధరలు రెట్టింపు అయ్యాయి. గత 20 రోజుల నుంచి జిల్లాలోని నంద్యాల, ఆళ్లగడ్డ నిమ్మకాయల మార్కెట్ (మండీ)లో పండుగాయలు బస్తా (సుమారు 40 కిలోలు) రూ.3,800 నుంచి రూ.4,000 పలకగా.. పచ్చికాయ రూ.4,000 నుంచి రూ.4,500 వరకు వ్యాపారులు సవాల్ పాడుతున్నారు. రెండు నెలల నుంచి ధరలు క్రమంగా పెరుగుతున్నాయి. ఒక దశలో బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో బస్తా రూ.8 వేలు వరకు చేరిందంటే నిమ్మ మార్కెట్ ఎంత జోరుమీదుందో అర్థమవుతుంది.

అంతర్జాతీయంగా డిమాండ్

ఆళ్లగడ్డ, చాగలమర్రి, రుద్రవరం, మహానంది, ప్యాపిలి, డోన్ మండాలాల నుంచి రోజు భారీగా నిమ్మకాయలు మినీ లారీలు, ఆటోలు, ట్రాక్టర్లలో ఆళ్లగడ్డ, నంద్యాల మార్కెట్‌లకు తరలివస్తున్నాయి. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారులు రైతులతో మాట్లాడుకుని ఇద్దరు, ముగ్గురు రైతులవి కలిపి లారీలకు లోడ్ చేసి నేరుగా బెంగళూర్, చెన్నై, విజయవాడ, హైదరాబాద్, వైజాగ్, జైపూర్, మహారాష్ట్ర మార్కెట్లకు ఎగుమతి చేస్తున్నారు. నిమ్మకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మార్కెట్ డిమాండ్ ఏర్పడటంతో అక్కడి నుంచి విదేశాలకు సైతం ఎగుమతి జరుగుతోంది.

రైతులకు నిఖరాదాయం

నిమ్మ ఏడాదికి మూడు కాపులు వస్తాయి. ఈ క్రమంలో ఏడాదిలో ఒక సీజన్‌లోనైనా మంచి ధర పలికితే చాలు అని గతంలో అనుకునేవారు. అలాంటిది మూడు సంవత్సరాలుగా సీజన్, అన్ సీజన్ అన్న తేడాలేకుండా నిమ్మకు డిమాండ్ ఉంటుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎకరా నిమ్మ సాగు చేసిన రైతు ఖర్చులు పోను రూ.4 నుంచి రూ.5 లక్షల వరకు నిఖర ఆదాయం పొందుతున్నారు. గతంలో ఎకరాకు ఏడాది పొడువునా రూ.లక్ష వరకు వస్తే పెద్ద సంగతి. ఇందులో ఖర్చులు, పెట్టుబడి పోను ఎకరాకు రూ.10 నుంచి రూ.20 వేలు మిగిలితే అంతే చాలు అనుకుని సంబరపడేవారు. అయితే ఈ సంవత్సరం ధర ఆశాజనకంగా ఉండటంతో మంచి ఆదాయం పొందుతున్నామని రైతులు చెబుతున్నారు.

ప్రభుత్వ ప్రోత్సాహం

ఆళ్లగడ్డ సబ్‌డివిజన్ పరిధిలో నిమ్మ సాగు ఏటికేడు విస్తారంగా పెరుగుతోంది. రైతులకు ప్రస్తుత ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోంది. గత ప్రభుత్వం నామమాత్రంగానే రాయితీలు అందించింది. అదీకూడా టీడీపీ నాయకులకు, వారు సిఫార్సు చేసిన వారికి మాత్రమే హెక్టార్‌కు రూ.13 వేలు మంజూరు చేసేవారు. ప్రస్తుతం తోటల పునరుద్ధరణ పథకం కింద ముదురు తోటలను తొలగించి చెట్లు నాటుకుంటే ఉద్యానశాఖ హెక్టార్‌కు రూ.17,700 రాయితీ అందజేస్తోంది. ఉపాధి హామీ పథకం కింద సన్న, చిన్నకారు రైతులకు నిమ్మ సాగుకు ప్రత్యేకంగా ప్రోత్సాహం లభిస్తోంది. ఎకరాకు ఏడాదికి రూ.50 వేల వరకు అందజేస్తున్నారు. సేద్యం ఖర్చులతో పాటు అంతర్ పంటల సాగుకు అయ్యే పెట్టుబడి కూడా ఉపాధి హామీలో అందిస్తోంది. వైఎస్సార్ జలకళ ద్వారా నిమ్మ తోటల్లో ప్రభుత్వం ఉచితంగా బోర్లు వేయిస్తోంది. ఇందు కోసం బోరు, కేసింగ్ పైపు, మోటరు, విద్యుత్ సౌకర్యం మొత్తం కలిపి ఒక్కో రైతుకు రూ.4 లక్షల వరకు ఖర్చు చేస్తోంది.

ధర పెరుగుతూ వస్తోంది



ఎకరా రూ.లక్ష ప్రకారం 3 ఎకరాలను కౌలుకు తీసుకున్నా. నెల నుంచి నిమ్మకాయకు ధర పెరుగుతూ వస్తోంది. గత రెండు కాపులు పెట్టుబడికి, కౌలుకు సరిపోయింది. డిసెంబర్‌లో వచ్చిన మంచుతో ప్రస్తుత కాపు కొంత మేర దెబ్బతినడంతో నష్టం వస్తుందని అనుకున్నాం. అయితే మార్కెట్లో ధర రోజు రోజుకూ పెరుగుతుండటంతో లాభాలు వస్తున్నాయి.

– నారపురెడ్డి, కౌలు రైతు, కోటకందుకూరు

మరింత పెరిగే అవకాశం

గతంలో ఎన్నడూ లేని విధంగా ఏడాది పొడువునా నిమ్మ ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. ప్రకృతి అనుకూలించక పోవడంతో దేశంలోని అనేక ప్రాంతాల్లో నిమ్మ కాపు సరిగా వచ్చినట్లు లేదు. అందుకే ధర బాగా పలికే అవకాశం ఉంది. ముఖ్యంగా జిల్లాలో ఆళ్లగడ్డ ప్రాంతంలోని భూములు, ఇక్కడి వాతావరణం నిమ్మసాగుకు బాగా అనుకూలం. ప్రస్తుతం వచ్చిన ఈదురు గాలులు, వడగండ్ల వర్షంతో అక్కడక్కడ నిమ్మ కాపు రాలిపోయింది. దీంతో ధర మరింత పెరిగే అవకాశం ఉంది. రైతులు జాగ్రత్తగా మార్కెటింగ్ చేసుకోవాలి.

– నాగరాజు, జిల్లా ఉద్యానశాఖాధికారి

సన్న జీవాలకు ఆంత్రాక్స్ ప్రమాదం


వ్యాధి సోకిన గొర్రెను పరిశీలిస్తున్న, జిల్లా పశువ్యాధి నిర్ధారణ కేంద్రం ఏడీ రవిబాబు

కర్నూలు(అగ్రికల్చర్): గొర్రెలు, మేకలకు ఆంత్రాక్స్ ప్రమాదం పొంచి ఉంది. ఇటీవల నంద్యాల జిల్లా కోవెలకుంట్ల ప్రాంతంతో ఆంత్రాక్స్ వ్యాధి బారిన పడి మూడు గొర్రెలు మృత్యువాత పడ్డాయి. ప్రతి ఏటా ఈ వ్యాధి కనిపిస్తోంది. ఆంత్రాక్స్ వ్యాధి కారణంగా గొర్రెలు మృతి చెందినట్లు శాస్త్రీయంగా నిర్ధారణ అయింది. ఈ నేపథ్యంలోతో గొర్రెల పెంపకందారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా పశువ్యాధి నిర్ధారణ కేంద్రం సహాయ సంచాలకులు డాక్టర్ రవిబాబు తెలిపారు. గొర్రెలకు సంబంధించిన మాంసం విక్రయాల్లో కనీస జాగ్రత్తలు తీసుకోకపోవడం ఆంత్రాక్స్ వ్యాధి విస్తరణకు కారణమవుతోందన్నారు. ఆంత్రాక్స్ సోకిన జీవాల మాంసం తినడం ద్వారా ఈ వ్యాధి మనుషులకు సులువుగా సోకే ప్రమాదం ఉందన్నారు. వ్యాధి నిర్ధారణ నేపథ్యంలో టీకా కార్యక్రమాన్ని ముమ్మరం చేసినట్లు ఏడీ వెల్లడించారు. ప్రస్తుతం కోవెలకుంట్ల, ఆదోని, చాగలమర్రి, బనగానపల్లి, శిరువెళ్ల, ఆళ్లగడ్డ, మహానంది తదితర ప్రాంతాల్లో ఈ కార్యక్రమం కొనసాగుతోందన్నారు.

లక్షణాలు..

- ఆంత్రాక్స్ వ్యాధి సోకిన పశువులను, జీవాలను చాల సులభంగా గుర్తించవచ్చు.
- అరుదుగా కొన్ని జంతువులు వణుకుతున్నట్లు ఉంటాయి.
- అధిక ఉష్ణోగ్రత, శ్వాసపీల్చుకోవడం కష్టమవుతుంది.
- వ్యాధి సోకిన రెండు రోజుల్లో పశువు నాలుక, గొంతు, మెడపై వాపు వస్తుంది.
- వ్యాధి బారిన పడిన పశువులు, జీవాలు గంటల వ్యవధిలో మరణిస్తాయి.